# సాక్షి
## కాకినాడ

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024






### ప్రగతి పథంలో రామచంద్రపురం

అభివృద్ధితో పాటు సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. సీఎం జగన్ చొరవతో రామచంద్రపురం మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది.


8 లో



### .. ఏపీ ప్రభుత్వ ప్రోత్సాహం భేష్

ప్రకృతి వ్యవసాయానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ బోర్డు సభ్యులు అనూప్ కిషోర్, కనోసే పనమస్ కంపెనీ చైర్మన్ వినోద్ కుమార్ అన్నారు.

### 7,800 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 7,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.25 అడుగులుగా ఉంది.

## న్యూస్‌రీల్

### ధాన్యం, బియ్యం నిల్వలు ప్రకటించాలి

కాకినాడ సిటీ: రాష్ట్రంలో వ్యాపారులు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైలర్లు, చిల్లర వర్తకులు, రిటైలర్లు, తయారీదారులు, రైస్ మిల్లర్లు తమ ధాన్యం, బియ్యం నిల్వల వివరాలను ప్రకటించాలని కాకినాడ జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన ఈ మేరకు ప్రకటనలో తెలిపారు. బియ్యం, నాన్ బాస్మతి తెల్ల బియ్యం, పారబాయిల్డ్, బాస్మతి రైస్, ధాన్యం నిల్వలను భారత ప్రభుత్వ వెబ్ పోర్టల్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. వారం, వారం ప్రాతిపదికన ప్రతి శుక్రవారం నిల్వలను ప్రభుత్వ పోర్టల్‌లో పొందుపరచాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

### జనసేన నేతలపై ఎస్పీకి ఫిర్యాదు



ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న అశోక్‌కుమార్

కాకినాడ క్రైం: దళిత యువకులపై జులుం ప్రదర్శిస్తున్న జనసేన నాయకులపై చర్యలు తీసుకోవాలని పీవీ రావు మాలమహానాడు అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఎస్పీ సతీష్‌కుమార్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. జనసేన నాయకుడు మాదేపల్లి శ్రీనివాసరావుపై హత్యాయత్నానికి రెక్కీ నిర్వహించారంటూ పిఠాపురానికి చెందిన దళిత యువకులపై జనసేన నాయకులు జులుం ప్రదర్శిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎవరో చేసిన పనికి దళిత యువకులను బాధ్యులను చేస్తున్నారన్నారు. యువకులపై జనసేన నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయడం, వారు యువకులను నిర్బంధించి వేధింపులకు పాల్పడడం అమానవీయమన్నారు. రోజువారీ కూలీ చేసుకుంటూ బతికే సదరు యువకుల కుటుంబీకులు తీవ్ర ఆందోళనకు గురయ్యారన్నారు. జనసేనకు అధికారం కట్టబెడితే దళితులపై మరిన్ని దారుణాలకు పాల్పడనున్నారన్నారు. దళిత యువకుల పట్ల జులుం ప్రదర్శించి, తప్పుడు ఫిర్యాదులు ఇచ్చిన జనసేన నాయకులపై తక్షణ చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

### పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్ఓ నరసింహులు అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ డీఆర్వో చాంబర్‌లో మార్చి నెలలో నిర్వహించాల్సిన ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై ఇంటర్మీడియెట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ విద్యా శాఖ, పోలీస్, విద్యుత్, వైద్యశాఖ, మున్సిపల్, సమాచార తదితర శాఖల అధికారులతో డీఆర్ఓ జి.నరసింహులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ పరీక్షలు మార్చి ఒకటవ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షల నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో మొత్తం 52 పరీక్షా కేంద్రాలలో 37,502 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ మొదటి, రెండవ ఏడాది పరీక్షలకు హాజరవుతున్నారన్నారు.

## సత్తెన్న సాక్షిగా..

# దాతలకు యాతన



- అన్నవరం సత్యదేవునికి రూ.లక్షలు, రూ.కోట్ల విరాళాలిచ్చినా దక్కని గుర్తింపు
- ప్రత్యేక దర్శనం, వసతి కల్పించాల్సి ఉన్నా పట్టని వైనం
- ఇతర భక్తుల్లా దర్శనం, వసతి కోసం కొండపై తిరుగాడే దుస్థితి
- గుర్తింపు కార్డులిచ్చి తగు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్న దాతలు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి విరాళాలిచ్చే దాతలు ఆ తరువాత స్వామివారి దర్శనానికి వచ్చినపుడు, లేదా సత్రాలలో బస చేసేటప్పుడు ఎవరిని సంప్రదించాలో తెలియక చాలా ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలోని కొన్ని దేవస్థానాలలో దాతలకు ఇస్తున్న గుర్తింపు ఈ దేవస్థానంలో లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దానికితోడు దాతలు ఏ స్కీముకు ఎంత విరాళం ఇచ్చారు, వారికి ఆ స్కీం కింద ఏ సదుపాయాలు కల్పిస్తారో తెలిపే గుర్తింపు కార్డులు కూడా లేవు. దీంతో దాతలు దేవస్థానానికి వస్తే తాము విరాళం ఇచ్చినపుడు ఇచ్చిన రశీదు, బాండ్ పట్టుకుని దేవస్థానమంతా తిరగాల్సి వస్తోంది.

**దేవస్థానంలో వివిధ స్కీంలకు దాతలు ఇచ్చిన విరాళాలు రూ.50 కోట్లు పై మాటే**

సత్యదేవుని నిత్యాన్నదాన పథకం, సత్రం గదుల నిర్మాణం, గోసేవకు, భవనాల నిర్మాణం, స్వామివారికి విలువైన ఆభరణాల సమర్పణ వంటి వాటికి భక్తులు విరాళాలు ఇస్తున్నారు. ఈ విరాళాలన్నీ రూ.50 కోట్లు పైనే ఉంటాయి. ఇటీవల ప్రారంభించిన శివసదన్ సత్రంలో ఒక గది నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున సుమారు 20 మంది వరకు దాతలు విరాళాలిచ్చారు. అదే విధంగా ఇతర సత్రాలకు విరాళాలిచ్చిన దాతలు చాలామంది ఉన్నారు.

**నిత్యాన్నదాన పథకంలో దాతలకు గుర్తింపు కార్డులు**

సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో రూ.లక్ష దాటి విరాళాలు ఇచ్చిన దాతలకు వారి ఫ్యామిలీ ఫొటోతో గుర్తింపు కార్డులు ఇస్తున్నారు. అయితే తమ ఫొటోలు అందజేయని వారికి, గతంలో విరాళాలిచ్చిన కొంత మంది దాతలకు ఇంకా గుర్తింపు కార్డులు అందలేదు. అయితే అన్నదానం దాతలకు అన్నదానంలో ప్రత్యేక క్యూ లైన్‌లో భోజన సౌకర్యం మాత్రమే ఉంది. సత్రాలలో గదులు, ప్రత్యేక దర్శనాల వంటి సదుపాయాలు లేవు కనుక పెద్దగా ఇబ్బంది లేదు.

**ఇతర స్కీములకు విరాళాలిచ్చిన దాతలకు గుర్తింపు కార్డులు లేవు**

అయితే కొన్ని స్కీములకు విరాళాలిచ్చిన దాతలకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆ స్కీములలో పొందుపరిచారు. కానీ గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. ఆ సదుపాయాలు పొందాలంటే ఎవరిని కలవాలో తెలియదు. పీఆర్వో ఆఫీసుకు వెళ్లినా అక్కడ గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. చివరకు సాధారణ భక్తుల్లా తాము కూడా వెళ్లిపోతే మంచిదేమో అని దాతలు అనుకునే పరిస్థితికి వచ్చారు.



**రూ.కోట్లలో విరాళాలిచ్చినా..**

సత్యదేవునికి రూ.కోట్లలో విరాళాలు ఇచ్చిన దాతలకు కూడా ఈ ఇబ్బంది తప్పడం లేదు. సత్యదేవునికి ప్రముఖ దాత పెద్దాపురంలోని శ్రీలలితా రైస్ ఇండస్ట్రీ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ రూ.4 కోట్లతో సత్యదేవుని ప్రసాద తయారీ భవనం నిర్మించారు. సహస్ర దీపాలంకార సేవకు రూ.20 లక్షలతో షెడ్డు నిర్మించి, ఆ సేవకు అవసరమైన సామగ్రి అందజేశారు. అదేవిధంగా స్వామివారి పంచహారతుల సేవకు వెండి సామగ్రి అందజేశారు. సత్యదేవునికి సుమారు రూ.కోటి వ్యయంతో వజ్రకిరీటం చేయించారు. తాజాగా దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి కూడా వజ్రకిరీటం చేయిస్తున్నారు. ఆయన సోదరుడు మట్టే శ్రీనివాస్ కూడా సత్యగిరిపై ఉచిత కల్యాణ మంటపం నిర్మించారు. ఏటా వందల సంఖ్యలో పేదలు ఇక్కడ వివాహాలు చేసుకుంటున్నారు. హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త బట్టు పర్వతయ్య, శారద దంపతులు రూ.70 లక్షలతో యాగశాల నిర్మించారు. విశాఖపట్నానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంఎస్ రెడ్డి ఉచిత కల్యాణ మంటపం నిర్మించారు. ప్రతి ఏకాదశికి సత్యదేవునికి అష్టోత్తర పూజ నిర్వహించేందుకు 108 స్వర్ణ పుష్పాలు సమర్పించారు. ఇంకా సత్యగిరిపై అతిథి గృహం కూడా నిర్మించారు. స్వామివారికి రూ.4 కోట్లతో స్వర్ణ ధ్వజస్తంభం నిర్మాణానికి నెల్లూరుకు చెందిన ఒక దాత ముందుకు వచ్చారు. ఇంకా చాలామంది దాతలు సత్యగిరిపై అతిథి గృహాలు నిర్మించారు. వీరందరికీ కూడా దేవస్థానం దాతలుగా గుర్తిస్తూ ఎటువంటి గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. వీరందరూ కొంత పలుకుబడి కలిగిన వారు. తాము నిర్మించిన వాటిలో పని చేసే సిబ్బంది ఉంటారు కనుక వారే దేవస్థానంలో వీరికి దర్శనం ఇతర సదుపాయాలు కల్పిస్తారు. కానీ మిగిలిన దాతలు దేవస్థానానికి వచ్చి దర్శనం కోసం, వసతి గదుల కోసం తాము దాతలమని చెబుతూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఉంటారు. అలాంటి వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి సదుపాయాలు కల్పించేందుకు దేవస్థానంలో ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి. దాతలు ఆ కార్యాలయంలో తమ గుర్తింపు కార్డులు చూపించి వెంటనే దర్శనం ఇతర సదుపాయాలు పొందే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

### దాతలకు గౌరవ మర్యాదలు కల్పిస్తాం




దేవస్థానానికి రూ.లక్షలు, రూ.కోట్లలో విరాళాలిచ్చిన దాతలకు గుర్తింపు కార్డులతో పాటు వారికి తగు గౌరవ మర్యాదలు, సదుపాయాలు కూడా కల్పిస్తాం. 2009–11 మధ్య నేను ఇక్కడ ఈఓగా పని చేసినపుడే దాతలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిర్ణయించాం. కొంతమంది దాతలకు కార్డులు ఇచ్చాం కూడా. ఆ తరువాత ఎందుకో ఆ కార్డుల పంపిణీ నిలిపివేశారు. మళ్లీ ఈ కార్డులను దాతలకు అందజేస్తాం. వారికి ఆ స్కీములలో పొందుపరచిన సదుపాయాలు కల్పిస్తాం.

– కె.రామచంద్రమోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

### విరాళం మొత్తాన్ని బట్టి కార్డులు ఇవ్వాలి

దాతలు సమర్పించిన విరాళాలను బట్టి వారికి వివిధ రంగుల కార్డులు ఇస్తే దేవస్థానంలో వారిని గుర్తించే అవకాశం సిబ్బందికి ఉంటుంది. ఉదాహరణకు రూ.లక్ష విరాళం ఇచ్చిన వారికి ఒక రంగు కార్డు, రూ.10 లక్షలు అంతకు మించి విరాళం ఇచ్చిన వారికి మరో కార్డు, రూ.కోటి దాటి విరాళం ఇచ్చిన దాతలకు వేరే రంగు కార్డు ఇస్తే వారికి గౌరవంగా ఉంటుంది. అంతేకాదు ఆ కార్డులలోనే వారికి అందజేసే సదుపాయాలు కూడా పేర్కొనాలి.




సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో రూ.లక్ష విరాళం ఇచ్చిన దాతలకు ఇస్తున్న గుర్తింపు కార్డు

# పనితీరు మెరుగు పడాలి



జిలా మహిళా సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి

**జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో పీడీ**

సామర్లకోట: మహిళా సంఘాల పనితీరు మెరుగుపడే విధంగా జిల్లా సమాఖ్య ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీరమణి అన్నారు. స్థానిక టీటీడీసీలో బుధవారం జరిగిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉన్నతికి సంబంధించి 100 శాతం ప్రగతి సాధించాలన్నారు. జిల్లా మహిళా సమాఖ్యలో మండల సమాఖ్య సభ్యుల భాగస్వామ్యం ఉండే విధంగా చూడాలన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న ప్రతీ సంఘం వ్యాపారం చేసే విధంగా చూడవలసిన బాధ్యత జిల్లా సమాఖ్యపై ఉన్నదని చెప్పారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు వడ్డీలు లేకపోవడం వలన వ్యాపారాలపై దృష్టి సారించి సకాలంలో వాయిదాలు చెల్లించాలని సూచించారు, రాని బాకీలను తగ్గించుకొవలసిన బాధ్యత ఉన్నదన్నారు. ఖర్చులను తగ్గించుకోవడం ద్వారా జిల్లా సమాఖ్య ఆదాయం పెంచుకోవాలని సూచించారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన స్త్రీ, శిశుసంక్షేమ శాఖ పీడీ ప్రవీణ మాట్లాడుతూ బాల్య వివాహాలపై మండల సమాఖ్య సభ్యులు దృష్టి సారించాలన్నారు. ప్రతీ గ్రామంలోను బాల్య వివాహాలపై అవగాహన పెంచాలని సూచించారు. ఈ సమావేశానికి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎల్.కాంచన అధ్యక్షత వహించగా కార్యదర్శి సి సంధ్యారాణి, ఉపాధ్యక్షురాలు జి కాంతం, సహాయ కార్యదర్శి సీహెచ్ రత్నం, కోశాధికారి డి.నిర్మల, డీఆర్‌డీఏ డీపీఎంలు బాబురావు, కేశవ్, రాయ్, వెంకటేశ్వరరావు, వీవీ పద్మావతి, ఏపీఎంలు చిట్టిబాబు, వేదకుమారి, జిల్లాలోని 20 మండలాలకు చెందిన మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంశాల వారీగా సమీక్ష జరిగింది. జిల్లా సమాఖ్య ప్రగతిని అధ్యక్షురాలు వివరించారు.

# ముగిసిన రుగ్వేద మహాసభలు

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని చింతామణి గణపతి మందిరంలో శ్రీ ఆశ్వలాయన మహర్షి రుగ్వేద పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న సంపూర్ణ రుగ్వేద పారాయణ, వేద విద్వత్ మహాసభలు బుధవారం ఘనంగా ముగిశాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 60 మంది వేద విద్వాంసులు మూడు రోజుల పాటు వేద పఠనం చేశారు. చివరి రోజు వేద విద్వాంసులను ఘనంగా సత్కరించారు. శ్రీ ఆశ్వలాయన మహర్షి రుగ్వేద పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోదావరి వెంకట సుబ్బారావు, చెరుకూరి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్, సహ కార్యదర్శి గంటి సుబ్రహ్మణ్య శాస్త్రి, సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. వేద రక్షకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వేద పఠనం చేస్తున్న రుగ్వేద పండితులు

## వెబ్ కాస్టింగ్ విధానంలో
# ఎన్నికల పోలింగ్ పరిశీలన

- ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: 2024 సాధారణ ఎన్నికల పోలింగ్‌ను వెబ్ కాస్టింగ్ విధానంలో పరిశీలిస్తాని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా–2024లోని అంశాలు, మార్పులు, చేర్పులు, 18–19 మధ్య వయసు ఉన్న యువత ఓటు నమోదు, పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు, ఈ–ఎపిక్ కార్డుల పంపిణీ, ఈవీఎం, వీవీప్యాట్‌ల ద్వారా ఓటింగ్ విధానం వంటి అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో చర్చించి కాకినాడ లోక్‌సభ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను వెబ్‌కాస్టింగ్ లైవ్ విధానంలో పరిశీలిస్తారన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేశామని తెలిపారు. గత జనవరి 22న ప్రచురించిన తుది ఓటరు జాబితాలో జిల్లా వ్యాప్తంగా 15,99,085 మంది ఓటర్లుగా నమోదయ్యారని కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి రవికిరణ్, గదుల సాయిబాబా, సబ్బారపు అప్పారావు, వల్లూరి రామమోహన్, ఎం.రాజశేఖర్, కలెక్టరేట్ కోఆర్డినేషన్ విభాగాధిపతి ఏఎస్ఎన్ రాధిక, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ ఎం జగన్నాథం పాల్గొన్నారు.

# ‘నులి’మేద్దాం

- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- రేపు జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం



జాతీయ నులిపురుగుల నిర్మూల దినం సందర్భంగా వైద్యులు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే గ్రామాల్లోను, పట్టణాల్లోను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, కమ్యూనిటీ ఆసుపత్రులలోని పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల ద్వారా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరిస్తున్నారు. నూరు శాతం చిన్నారులకు ఈ మాత్రలు అందేలా చర్యలు తీసుకున్నారు.

కాకినాడ సిటీ: ఆడుతూ పాడుతూ స్కూల్‌కు వెళ్లాల్సిన పిల్లలు కడుపునొప్పి అని చెబితే తక్షణమే వైద్యుడిని సంప్రదించండి. చిన్నారుల జీవితాన్ని నులిపురుగులు తినేస్తున్నాయి. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. పిల్లల్లో అనేక రకాల అనారోగ్యాలకు కారణమవుతున్న నులిపురుగులను కేవలం ఒకే మాత్ర ఆల్బెండజోల్‌తో నివారించవచ్చు. ఈ నెల 9న

| సంస్థ పేరు | సంఖ్య | చిన్నారుల సంఖ్య |
|---|---|---|
| అంగన్‌వాడీ కేంద్రాలు | 1,986 | 85,276 మంది |
| అంగన్‌వాడీలో నమోదుకాని వారు | | 2,358 మంది |
| ప్రభుత్వ పాఠశాలలు | 1,288 | 1,55,824 మంది |
| ప్రైవేట్ పాఠశాలలు | 576 | 1,63,171 మంది |
| ప్రభుత్వ ఎయిడెడ్ జూనియర్, కళాశాలలు, ప్రైవేట్ కళాశాలలు, టెక్నికల్, వృత్తి విద్యా, ప్రొఫెషనల్ నర్సింగ్ కళాశాలలు మొత్తం | 219 | 55,055 మంది |

### నులి పురుగుల నివారణపై విస్తృత ప్రచారం



ఇప్పటికే గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాం. ప్రైమరీ హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ సెంటర్లు, స్కూల్స్, కళాశాలల్లో వాల్ పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించాం. పిల్లలను రక్త హీనత నుంచి కాపాడేందుకు ఆల్బెండజోల్ మాత్రను తీసుకునే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు చూసేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో దాదాపుగా 4.61 లక్షల మంది పిల్లలున్నట్లు గుర్తించాం. నూరుశాతం మాత్రలు వేసుకునే విధంగా చర్యలు చేపట్టాం.

– జె.నరసింహనాయక్, డీఎంఅండ్‌హెచ్‌వో, కాకినాడ జిల్లా

**అనర్థాలు**

నులిపురుగులు చిన్నారుల్లో రక్తహీనతకు దారితీస్తాయి. శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారతాయి. కడుపులోపల చేరి నొప్పి, మంట, వికారం కలుగజేస్తాయి. దీనివల్ల ఆహారం సహించదు. ఆకలి ఉండదు. పిల్లలు నీరసపడతారు. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. వాంతులు, మలంలో రక్తం, అతిసారం వంటి సమస్యలు ప్రబలుతాయి. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లల్లో నులిపురుగు సమస్య ఎక్కువగా ఉంటుంది.

**అపరిశుభ్రతే కారణం**

అపరిశుభ్రత వల్లే నులిపురుగులు ఎక్కువగా వ్యాపిస్తాయి. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించని పిల్లలకు నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది. పిల్లలు ఎప్పుడూ చేతిగోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. గోళ్లు పెరిగినప్పుడు వెంటనే కత్తిరించుకోవాలి. లేకుంటే వాటిల్లో పేరుకున్న మట్టి ద్వారా నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. కలుషిత నీరు తాగడం, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన వల్ల కూడా నులిపురుగులు మన శరీరంలోకి చేరతాయి. కూరగాయలను కడగకపోవటం, భోజనం చేసే ముందు చేతులు కడుక్కోక పోవడం, ఆహార పదార్థాలపై మూతలు లేకపోవడం వల్ల కూడా నులిపురుగుల ప్రభావం ఉంటుంది.

**ఇలా నివారించవచ్చు..**

పిల్లల్లో మూడు రకాల పురుగులు ఉండే అవకాశం ఉంది. అవి ఏలికపాములు, నులిపురుగులు, కొంకి పురుగులు. వీటిని నిర్మూలించేందుకు అల్బెండజోల్ మాత్రలను తీసుకోవాలి. మాత్రను భోజనం తర్వాత తీసుకోవాలి. మాత్ర వేసుకున్న ఒక రోజు లేదా రెండు రోజుల్లో నులిపురుగులు ఉన్నట్లయితే మలవిసర్జన ద్వారా బయటకు వెళ్తాయి.

**ఈ జాగ్రత్తలు తీసుకోవాలి**

బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయకూడదు. మల విసర్జన తర్వాత భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. కాళ్లకు చెప్పులు లేదా బూట్లు ధరించాలి. పెరిగిన గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. పరిశుభ్రమైన నీటిని తాగాలి. పండ్లు, కాయగూరలు శుభ్రంగా కడిగిన పిదప మాత్రమే వినియోగించాలి. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

**మాత్రల డోస్ ఇలా..**

జబ్బుతో ఉన్న లేదా ఏదైనా ఇతర మందులు వాడుతున్న పిల్లలకు ఈ నులిపురుగుల నిర్మూలన మాత్ర ఇవ్వకూడదు. ఏడాది లోపు పిల్లలకు మాత్రలు ఇవ్వకూడదు. ఏడాది నుంచి రెండేళ్ల లోపు చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్ర ఇవ్వాలి. లేదా సిరప్‌ను 5 మిల్లీమీటర్లు ఇవ్వాలి. రెండు నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఒక మాత్రను మధ్యాహ్నం భోజనం తర్వాత నమిలి మింగేలా చూడాలి.

**జిల్లా వ్యాప్తంగా 4.61 లక్షల మందికి పంపిణీ**

జిల్లాలో 1,296 ప్రభుత్వ పాఠశాలలు, 576 ప్రైవేట్ పాఠశాలలు,1986 అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కాలేజీలు, డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్, నర్సింగ్, పాలిటెక్నికల్ కళాశాలలు, ఐటీఐలు కలిపి మొత్తం 219 కళాశాలల్లో 4,61,684 మందికి పైగా విద్యార్థులు 19 ఏళ్లలోపు పిల్లలు ఉన్నారు. వీరందరికి ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 9వ తేదీన పిల్లలంతా మాత్రలను నమిలి మింగేలా చూసేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. 9వ తేదీన 95 శాతం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య ఆరోగ్య మిషన్ ద్వారా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ నిర్వహిస్తున్నారు. ఎవరైనా మాత్రను తీసుకోని పక్షంలో వారికి మాప్ అప్ కార్యక్రమంలో భాగంగా 16వ తేదీన మాత్రలను అందజేస్తారు.

## క్లుప్తంగా

### గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సామర్లకోట: స్థానిక రైల్వే పోలీసు స్టేషన్ సమీపంలోని గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు రైల్వే ఎస్సై బి.లోవరాజు తెలిపారు. రైల్వే ట్రాక్ కీమెన్ బి.కొండయ్య పిఠాపురం నుంచి సామర్లకోట వరకూ పట్టాలపై తిరుగుతున్న సమయంలో రాజమహేంద్రవరం వైపు వెళ్లే కేఎం నంబర్ 632/13–15 పోస్టుల మధ్య తుప్పల్లో మృతదేహాన్ని గుర్తించి, స్టేషన్ ఎస్ఎస్ పి.హేమసుందర్‌కు సమాచారం ఇచ్చాడన్నారు. దీంతో సంఘటనా ప్రదేశానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడు సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు, 5.8 అడుగుల ఎత్తు ఉన్నాడన్నారు. ఒంటిపై జీన్ ప్యాంట్, టీషర్టు ఉన్నాయన్నారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచామని, వివరాలకు 93988 50428 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### తల్లిదండ్రులకు బాలిక అప్పగింత



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఏఎస్సై సింహాద్రి

సామర్లకోట: తల్లి మందలించిందని అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికను బుధవారం సాయంత్రం పోలీసులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. ఏఎస్సై సింహాద్రి కథనం ప్రకారం.. తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న ఓబా ప్రియదర్శినిని గత నెల 21న తల్లి దయామణి మందలించింది. దీంతో ప్రియదర్శిని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు 22వ తేదీన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ప్రియదర్శిని నిడదవోలులోని మేనత్త ఇంటి వద్ద ఉన్నట్లు గుర్తించారు. కౌన్సెలింగ్ చేసి సామర్లకోట తీసుకువచ్చారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్.శ్రీనివాసరావు సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

# ప్రగతి పథంలో రామచంద్రపురం

- అభివృద్ధి వరుగులు
- ఏళ్ల నాటి సమస్యలకు మోక్షం
- సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి



విశాలమైన రైతు బజార్



పట్టణంలో సుందరంగా నిర్మించిన టిడ్కో ఇళ్లు

**రామచంద్రపురం: అభివృద్ధితో పాటు సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అంది**స్తోంది. సీఎం జగన్ చొరవతో రామచంద్రపురం మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గతానికి భిన్నంగా పట్టణంలోని పలు సమస్యలకు పరిష్కారం లభించింది. గుడ్ మార్నింగ్, గడప గడపకూ మన ప్రభుత్వం వంటి కార్యక్రమాల ద్వారా గుర్తించిన, ప్రజల నుంచి వచ్చిన విన్నపాలపై స్పందిస్తూ సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేశారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకూ రూ.75 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టారు.

**వైఎస్సార్ సీపీ హవా**

మున్సిపాలిటీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో మున్సిపాలిటీలోని 28 వార్డులకు గాను 10 వార్డులో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఏకగ్రీవమయ్యారు. ఎన్నికల్లో మరో 14 వార్డుల్లో విజయం సాధించి తిరుగులేని మెజారిటీ సాధించారు. 28 వార్డుల్లోనూ నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవటంలో సఫలీకృతులయ్యారు. 28 సంక్షేమ పథకాల ద్వారా ఈ ఐదేళ్లలో 1,14,449 మంది లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాల్లో రూ.121,08,59,485 జమ చేశారు.

**ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం**

పట్టణంలోని తోటవారివీధిలో గల రాజుమాస్టారు వీధి ఎంతో కాలంగా అభివృద్ధికి నోచుకోలేదు. కనీసం రోడ్డు లేక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండేవారు. ఇదే ప్రాంతంలో డ్రైనేజీ లేకపోవటంతో మురుగునీరు రహదారిపైకి ప్రవహించేది. మార్కెట్‌లోని చిన్నవీధి 18 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోకపోవటంతో వర్షాకాలంలో ముంపుబారిన పడేది. ఇలా 28 వార్డుల్లోని ఏళ్లనాటి సమస్యలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మోక్షం లభించింది. రాజుమాష్టారు వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించి సమస్యను పరిష్కరించారు. మార్కెట్‌లోని చిన్న వీధిలో సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు.

**చకచకా పనులు**

కౌన్సిల్ పాలక వర్గం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే సుమారు రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. శివారున నూతనంగా ఏర్పడిన ప్రాంతాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. రెండో ఏడాదిలో రూ.75 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. మూడో ఏడాదికి సంబంధించి వివిధ పథకాల నిధులతో పాటు ప్రత్యేక నిధులు రూ.40 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రణాళికలు తయారు చేశారు. రూ.1.25 కోట్లతో రైతు బజారు నిర్మాణం పూర్తి చేశారు.

**ఏరియా ఆస్పత్రిలో వసతులు**

వంద పడకల ఆసుపత్రిగా మూడు నియోజకవర్గాల ప్రజలకు సేవలందిస్తున్న ఏరియా ఆసుపత్రిని మరో 30 పడకలకు పెంచి అభివృద్ధి చేశారు. ఆసుపత్రిలో రోగులకు అత్యంత ఆధునిక సౌకర్యాలను మెరుగు పర్చారు. కార్డియాలజీ, కంటి శస్త్ర చికిత్సలు, ఆక్సిజన్ ప్లాంట్ల నిర్మాణాలను పూర్తి చేసి, అందుబాటులోనికి తీసుకువచ్చారు. అన్ని విభాగాల్లోనూ సుమారు 36 మంది ప్రత్యేక వైద్యులను నియమించారు.

**నాడు – నేడుతో పాఠశాలల వికాసం**

నాడు – నేడు ఫేజ్ 1, ఫేజ్ 2 ద్వారా పట్టణంలోని మున్సిపాలిటీ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారు. రూ.6.45 కోట్లతో పాఠశాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించారు.

**డ్రైనేజీల ప్రక్షాళన**

ఆరు కిలోమీటర్ల పొడవున్న ప్రధాన డ్రైనేజీల్లో రూ.23 లక్షలతో పూడిక తీసి, ఎంతో కాలంగా ఉన్న సమస్యను సమూల ప్రక్షాళన చేశారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న రెండు డ్రైనేజీల్లో రెండు నుంచి మూడు అడుగల వరకూ సిల్టు ఉంటుందని అధికారులు భావించారు. అయితే డ్రైనేజీలపై బల్లలు తొలగించిన తరువాత చూసి, అవాక్కయారు. వాటిలో 5 నుంచి 6 అడుగుల వరకూ సిల్టు ఉండటంతో త్వరితగతిన జరగాల్సి పని, రోజుల తరబడి కొనసాగుతోంది. ఈ పూడికతీత కారణంగా ఎన్నో ఏళ్లగా ఉన్న సమస్య పరిష్కారమవుతుందని పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**టిడ్కో ఇళ్ల పంపిణీ**

గత ప్రభుత్వం అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన టిడ్కో గృహాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూర్తి చేసి, అన్ని రకాలుగా మౌలిక సదుపాయాలు కల్పించింది. మొదటి విడతలో 998 మంది లబ్ధిదారులకు ఫ్లాట్లు అందజేశారు.

**సంక్షేమ పథకాల తీరు**

| పథకం | లబ్ధిదారులు | మొత్తం సొమ్ము |
|---|---|---|
| వైఎస్సార్ పెన్షన్ కానుక | 4,426 | రూ.48,93,69,500 |
| జగనన్న అమ్మఒడి | 2,336 | రూ.12,93,17745 |
| జగనన్న వసతి దీవెన | 3,710 | రూ.3,49,61,656 |
| జగనన్న విద్యా దీవెన | 4,983 | రూ.6,14,62,666 |
| వైఎస్సార్ రైతు భరోసా | 9,829 | రూ.10,79,64,456 |
| వైఎస్సార్ వాహన మిత్ర | 866 | రూ.5,41,0000 |
| వైఎస్సార్ ఆసరా | 19,449 | రూ.13,13,32,237 |
| వైఎస్సార్ చేయూత | 5,074 | రూ. 6,96,36,250 |
| వైఎస్సార్ కాపునేస్తం | 4,500 | రూ.3,16,54000 |
| వైఎస్సార్ బీమా | 65 | రూ. 1,06,60,000 |

**ఖర్చు చేసిన వివిధ పథకాల నిధులు**

| | |
|---|---|
| బీపీఎస్ నిధులు | రూ.11.06 లక్షలు |
| ఎస్‌సీఎస్‌పీ గ్రాంటు | రూ. 5.60 లక్షలు |
| 14వ ఫైనాన్స్ నిధులు | రూ.3,87 కోట్లు |
| 15వ ఫైనాన్స్ నిధులు | రూ.1,42 కోట్లు |
| మున్సిపాలిటీ జనరల్ నిధులు | రూ.83,44 లక్షలు |
| మొత్తం అభివృద్ధి నిధులు | రూ.7,57 కోట్లు |
| డ్రైనేజీల పూడిక తీత | రూ.23 లక్షలు |
| వైఎస్సార్ అర్బన్ క్లినిక్ | రూ.1.19 కోట్లు |
| రైతు బజార్ నిర్మాణం | రూ.1 కోటి |
| ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి | రూ.10 కోట్లు |
| నాడు - నేడు ఫేజ్ -1 | రూ.1.81 కోట్లు |
| నాడు - నేడు ఫేజ్ - 2 | రూ. 4.64 కోట్లు |



మున్సిపాలిటీలో డ్రైనేజీల నిర్మాణం



రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి

**సంక్షేమంతో పాటు అభివృద్ధి**



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమంతో పాటుగా అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందింది. మున్సిపాలిటీ పరిధిలో గడచిన నాలుగేళ్లలో అభివృద్ధి పరుగులు పెట్టింది.

– పిల్లి సూర్యప్రకాశ్, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్

**అభివృద్ధే అజెండా**



రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు పాటుగా మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశాం. వివిధ పథకాల ద్వారా వచ్చిన గ్రాంట్లను సక్రమంగా వినియోగించి ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మున్సిపాలిటీని ప్రగతి పథంలో నడిపిస్తున్నాం.

– గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ చైర్ పర్సన్

**సమస్యలకు మోక్షం**



మున్సిపాలిటీలో చాలా ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు ఇక్కట్లు పడేవారు. గతంలో ఎన్నిసార్లు సమస్యలను విన్నవించినా ఉపయోగం లేకుండా పోయింది. ప్రస్తుతం కౌన్సిల్ హయాంలో ఎంతో కాలంగా ఉన్న సమస్యలకు మోక్షం లభించింది. అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేశారు.

– మట్టా బాబులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్

### ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది జైలు

కొవ్వూరు: దొమ్మేరు గ్రామంలో 2020 మార్చి 21న జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడైన వెలుగుల వీర వెంకట తులసీ వరప్రసాద్ అనే ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది సాధారణ జైలుశిక్ష విధిస్తూ సెకండ్ అడిషనల్ అండ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జి.సాయికృష్ణ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ డి.బాబూరావు వాదించారు. కేసు విచారణకు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు సహకరించారు. అప్పట్లో జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో వాతాడ అప్పాయమ్మ అనే వృద్ధురాలు దుర్మరణం చెందింది. విచారణలో వర ప్రసాద్‌పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.



### మహిళ దుర్మరణం



అపర్ణ (ఫైల్)

పిఠాపురం: స్థానిక పాదగయ జంక్షన్‌లో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలయ్యాయి. పిఠాపురం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలం కొత్త మూలపేట ఎస్ఈజెడ్ కాలనీకి చెందిన చింతాడ నాగేశ్వరరావు, ఆయన భార్య అపర్ణ (40) మోటారు సైకిల్‌పై కాకినాడ ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తున్నారు. పిఠాపురం పాదగయ జంక్షన్ వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి కత్తిపూడి వైపు వస్తున్న లారీ వెనుక నుంచి వారిని ఢీకొంది. ఈ ఘటనలో అపర్ణ అక్కడికక్కడే మృతి చెందగా, నాగేశ్వరరావుకు గాయాలయ్యాయి. ఎస్సై మురళీ మోహన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

### వివాహిత అనుమానాస్పద మృతి



హారిక మృతదేహం

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట గ్రామంలోని తాడిపాలెం ఐశ్వర్యాంబిక ఎన్‌క్లేవ్‌లో భర్తతో కలిసి నివాసం ఉంటున్న గొర్ల హారిక (23) అనుమానాస్పదంగా మృతి చెందింది. సర్పవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హారికకు జాషువాతో గత ఏడాది వివాహమైంది. మంగళవారం ఉదయం హారిక స్నానం చేయడానికి వెళ్లగా విద్యుత్ ఘాతంతో చేతులు కాలి నేలపై పడిపోయింది. బయట నుంచి అప్పుడే వచ్చిన భర్త జాషువా ఆమెను చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారి సహకారంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చగా అదేరోజు సాయంత్రం మృతి చెందింది. కుమార్తె మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేయడంతో పాటు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సర్పవరం ఎస్సై టి.శ్రీనివాస్ కుమార్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ దర్యాప్తు చేపట్టారు.

**హారిక మృతిపై ఆందోళన**

కాకినాడ క్రైం: తన కుమార్తెను అల్లుడు, అతని కుటుంబం కట్నం కోసం హత్య చేశారని హారిక తల్లిదండ్రులు ఆరోపించారు. మృతదేహానికి పోస్టుమార్టం జరుగుతుండగా కాకినాడ జీజీహెచ్ ఆవరణలో ఆందోళనకు దిగారు. హారికను మూడు నెలల క్రితం బొండాడ జాషువాకు ఇచ్చి వివాహం చేశామన్నారు. ప్రేమ వివాహమైనా తమ కుమార్తెకు కట్నం వేధింపులకు తప్ప లేదన్నారు. విద్యుత్ షాక్‌తో చనిపోయినట్టు చిత్రీకరించారని ఆరోపించారు. మెడపై తాడుతో బిగించి చంపిన ఆధారాలు స్పష్టంగా ఉన్నాయన్నారు.

### నకిలీ పత్రాలతో కారుణ్య నియామకం

- మృతి చెందిన వ్యక్తి భార్య స్థానంలో మరొకరికి ఉద్యోగం
- 8 మందికి మూడేళ్ల జైలు, జరిమానా

కాకినాడ లీగల్: నకిలీ పత్రాలు సృష్టించి కాకినాడ మున్సిపాలిటీలో కారుణ్య నియామకం పొందిన మహిళ, ఆమె కుటుంబ సభ్యులు, అందుకు సహకరించిన మున్సిపల్ ఉద్యోగులు.. మొత్తం ఎనిమిది మందికి ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు, రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ 2వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి తీర్పు చెప్పారు. కాకినాడ మున్సిపాలిటిలో ఉద్యోగం చేస్తున్న రేచర్లపేటకు చెందిన కోల్లాబత్తుల వెంకట రమణ అనారోగ్యంతో 2012లో మృతి చెందాడు. అతడి భార్య అరుణకుమారి జీవనోపాధి నిమిత్తం విదేశాల్లో ఉంటోంది. ఈ నేపథ్యంలో అరుణ కుమారి అత్త, వారి కుటుంబ సభ్యులు ఏకమై, అరుణ కుమారి తోటి కోడలైన కోల్లాబత్తుల లక్ష్మిని అరుణకుమారిగా చూపించారు. అందుకోసం నకిలి పత్రాలు సృష్టించి, వెంకట రమణ భార్య అరుణ కుమారిగా లక్ష్మిని చూపించి కాకినాడ మున్సిపాలిటీలో కారుణ్య నియామకం పొందారు. మృతి చెందిన వెంకట రమణ ద్వారా రావాల్సిన రాయితీలూ లక్ష్మి తీసుకుంది. కాగా.. విదేశాల నుంచి తిరిగి వచ్చిన అరుణకుమారి జరిగిన వ్యవహారంపై 2012 ఏప్రిల్ 10న కాకినాడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం కొల్లాబత్తుల అప్పయ్యమ్మ, కొల్లాబత్తుల లక్ష్మి, కొల్లాబత్తుల గోపి, కొల్లాబత్తుల శ్రీనివాసరావు, కొల్లాబత్తుల శారద, కిలీమి వీర రాఘవరెడ్డి, నీలాపు రమణ, సాడి సత్యనారాయణకు పైవిధంగా జైలుశిక్ష విధించారు. సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోసాల కమల కుమారి వాదనలు వినిపించారు.

# ప్రకృతి సాగుకు ఏపీ ప్రభుత్వ ప్రోత్సాహం భేష్

- అభినందించిన కేరళ ప్లానింగ్ బోర్డు సభ్యులు
- గంగలకుర్రులో పర్యటన



గంగలకుర్రులో కోకో గింజలను పరిశీలిస్తున్న కేరళ బృందం

అంబాజీపేట: ప్రకృతి వ్యవసాయానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ బోర్డు సభ్యులు అనూప్ కిషోర్, కన్సోషనమస్ కంపెనీ చైర్మన్ వినోద్ కుమార్ అన్నారు. ఆ సాగు విధానాలను తెలుసుకునేందుకు బుధవారం గంగలకుర్రుకు చెందిన సీహెచ్ బాబూరావు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంలో ఆచరిస్తున్న, అమలు చేస్తున్న పద్ధతులను రైతు బాబూరావును అడిగి తెలుసుకున్నారు. జీవామృతం తయారీ విధానాన్ని, వర్మీ వాష్ ఉపయోగాలను ఆయన వివరించారు. కొబ్బరి తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న కోకో, అరటి, జామ, పసుపు, పోక తదితర వాటిని కేరళ సభ్యులు పరిశీలించించారు. కోకో గింజలను వేరు చేసుకునేందుకు బాబూరావు తయారు చేసిన పరికరాన్ని పరిశీలించి అభినందించారు. ఏపీ ప్రభుత్వం రైతులకు 9 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కొబ్బరి తోటల్లో పనులు చేయడం వల్ల రైతులకు నిర్వహణ వ్యయం తగ్గుతుందన్నారు. వారి వెంట ప్రకృతి వ్యవసాయ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, రైతు సాధికార సంస్థ రాష్ట్ర బృందం సభ్యులు ఎం.చందు, బి.శ్రీను, కల్పన, ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ సభ్యులు ఉన్నారు.

## భీష్మ ఏకాదశికి రత్నగిరిపై విస్తృత ఏర్పాట్లు



అధికారులతో సమీక్షిస్తున్న ఈఓ రామచంద్ర మోహన్

అన్నవరం: భీష్మ ఏకాదశి పర్వదినం (ఈనెల 20) సందర్భంగా సత్యదేవుని దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఈఓ కె.రామచంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. ఆరోజు దేవస్థానంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై బుధవారం అధికారులతో సమీక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున క్యూలైన్లలో తాగునీరు, చిన్నారులకు పాలు, బిస్కెట్లు అందించాలన్నారు. ముందు రోజు అర్ధరాత్రి నుంచీ సత్యదేవుని వ్రతాల నిర్వహణ, స్వామివారి దర్శనానికి ఏర్పాట్లు చేయాలన్నారు. భీష్మ ఏకాదశి ఉదయం ఎనిమిది గంటల నుంచి భక్తులకు దద్ధోజనం, పులిహోర పంపిణీ చేయాలని ఆదేశించారు. భక్తులందరికీ వసతి గదులు లభించే అవకాశం ఉండదు కావున విశ్రాంతి మండపాలలో విశ్రాంతి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని, ప్రసాదాల విక్రయాలకు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఘాట్‌రోడ్‌లో ట్రాఫిక్ జామ్ అవ్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో వేదపండితులు, అర్చకులు, వ్రత పురోహితుల సూపర్‌వైజర్లతో పాటు ఈఈలు నరసింహారెడ్డి, మురళీ, ఏఈఓలు జగ్గారావు, కృష్ణారావు, డీఈలు గుర్రాజు, బీఎస్ రాంబాబు, ఎలక్ట్రికల్ డీఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.